ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
మంగళవారం 11 నవంబరు 2025



'డంపింగ్ యార్డును మార్చాలి'

కోరుట్ల రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామంలో డంపింగ్ యార్డును మార్చాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కమిషనర్ రవీందర్‌కు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మోహన్‌రెడ్డి, నాయకుడు అరకంటి సాగర్‌లు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో వీధి కుక్కల స్వైర విహారంతో గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కాల్వ వద్ద డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడంతో వాటికి సమీపంలో గంగమ్మ తల్లి, పెద్దమ్మ తల్లి దేవాలయాలు ఉండడంతో ఆలయాలకు వెళ్లే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారన్నారు. గ్రామస్థుల కోరిక మేరకు అభివృద్ధికి కృషి చేయాలని వారు కోరారు.

వివాహానికి ఆర్థిక సహాయం

రాయికల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణానికి చెందిన పల్లికొండ లత అనే నిరుపేద మహిళ కూతురు వివాహం నిమిత్తం సోమవారం జమాతే ఇస్లామీ రాయికల్ శాఖ ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామీ అధ్యక్షుడు షంషీర్, మాజీద్ కమిటీ అధ్యక్షుడు సోహెల్, నయీమ్, మసూద్, ఇంతియాజ్, అఖిల్ పాల్గొన్నారు.

ఆలయ కార్యవర్గం ఎన్నిక

బీర్‌పూర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొల్వాయి గ్రామంలోని సీతారామస్వామి ఆలయ కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ చైర్మన్‌గా పంతుల లక్ష్మన్, వైస్ చైర్మన్‌గా జెట్టి రాజేష్‌ను ఎన్నుకున్నట్లు ఆలయ సిబ్బంది తెలిపారు.

రాజీవ్ యువవికాసం ఇంకెప్పుడు..?



- రుణాల కోసం యువతీ యువకుల ఎదురుచూపులు
- తేలని సిబిల్‌స్కోర్ సమస్య
- ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నామని యువత ఆవేదన

జగిత్యాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం దరఖాస్తుదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. నెల రోజుల్లో రుణాలు ఇప్పిస్తామని దరఖాస్తులు స్వీకరించి, మండల స్థాయిలో కమిటీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్న ప్రభుత్వం ఇప్పటికీ ఆ దిశగా అడుగులు వేయడం లేదని యువత ఆవేదన వ్యక్తం చేస్తోంది. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల నుంచి వేల సంఖ్యలో నిరుద్యోగ యువతీ యువకులు రుణాల కోసం దరఖా స్తులు చేసుకున్నారు.

జిల్లాలో వచ్చిన దరఖాస్తులు ఇలా..

కార్పొరేషన్ పేరు	యూనిట్ల లక్ష్యం	దరఖాస్తులు
ఎస్సీ	4,402	11,300
ఎస్టీ	674	1,437
మైనార్టీ	764	3,922
బీసీ	7,013	31,128
మొత్తం	12,853	47,787

వివిధ యూనిట్ల కోసం దరఖాస్తులు చేసుకోగా అధిక విలువ కలిగిన యూనిట్లతో మెరుగైన స్వయం ఉపాధి పొందవచ్చన్న ఉద్దేశంతో ఎక్కువ మంది కేటగిరీ-4 రుణాలకే మొగ్గు చూపారు. వ్యవసాయ రంగంతో పాటు చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుతో యువత ఆర్థిక పురోగతి పొందేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. అర్హులైన యువకుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. దరఖాస్తుల పరిశీలన, అర్హుల ఎంపికకు ఇంటర్వ్యూల నిర్వహణ తదితర కసరత్తును సైతం పూర్తి చేసింది. రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో లబ్ధిదారులకు సాయం అందించాల్సి ఉండగా పలు ఆరోపణల నేపథ్యంలో కార్యక్రమం ఆకస్మికంగా వాయిదా పడింది.



రాయికల్‌లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

జిల్లా వ్యాప్తంగా 47,787 దరఖాస్తులు..

జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీలతో పాటు అన్ని మండలాల పరిధిలో గల గ్రామాల్లో సుమారు పన్నెండు లక్షలపై చిలుకు జనాభా ఉంది. రాజీవ్ యువవికాసంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల నుంచి దరఖాస్తులను అధికారులు ఆహ్వానించారు. ఆయా సామాజిక వర్గాల నుంచి దరఖాస్తులు పోటెత్తాయి. జిల్లా వ్యాప్తంగా వివిధ సామాజిక వర్గాలకు చెందిన సుమారు 47,787 మంది యువతీ యువకులు దరఖాస్తు చేసుకున్నారు.

ఆర్‌బీఐ నిబంధనలు..

గతంలో పేదలకు ఆయా పథకాల కింద రుణాలు అందించేవారు. అవసరమైతే సబ్సిడీకి మించి రుణాలు తీసుకుంటే ష్యూరిటీ కింద సంతకాలు, ఇతర పత్రాలు తీసుకునే వారు తప్ప పెద్దగా బ్యాంకర్ల నుంచి ఇబ్బందులు ఎదురయ్యేవి కావు. ప్రస్తుతం మారిన ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం సిబిల్ స్కోర్ ఉంటేనే రుణానికి అర్హత సాధిస్తారు. అయితే రాజీవ్ యువ వికాసం దారులకు మిగతా 8లో

నేడు దిశ సమావేశం

జగిత్యాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో మంగళవారం ఉదయం 10.30 గంటలకు దిశ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ హాజరుకానున్నారు. అదేవిధంగా పలు కార్యక్రమాలలో ఎంపీ పాల్గొననున్నారు. ఉదయం 9 గంటలకు స్థానిక మార్కండేయ దేవాలయంలో పూజ చేసి, 10 గంటలకు సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి ఉత్సవాల్లో భాగంగా పాత బస్టాండు నుంచి సర్దార్ వల్లబాయ్ పటేల్ చౌక్ వరకు ర్యాలీలో పాల్గొంటారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ యాదగిరి బాబు, బీజేపీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డిలు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు బీజేపీ జిల్లా కార్యాలయంలో న్యాయవాదులతో సమావేశం, పార్టీలో చేరిక కార్యక్రమాల్లో ఎంపీ అరవింద్ పాల్గొంటారన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ బీఎస్ లత, అధికారులు

జగిత్యాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం హైద్రాబాద్ నుంచి సీఎస్ రామకృష్ణరావుతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లతతో పాటు పలువురు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నిర్ణీత లక్ష్యం మేరకు కొనుగోలు కేంద్రాలను వెంటనే తెరవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోగా చెల్లింపులు జరపాలని, వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కేంద్రాల వద్ద టార్పలిన్లు, గన్ని బ్యాగులు, ప్యాడి క్లీనర్లు సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, డీఎం జితేంద్ర ప్రసాద్, డీఆర్‌డీవో రఘువరన్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాశ్, డీఏవో భాస్కర్, ఆర్‌టీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు

ఎస్పీ అశోక్ కుమార్



బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎస్పీ

జగిత్యాల టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పోలీసుస్టేషన్‌కు వచ్చిన బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని జిల్లాలోని పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశిం చారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డే సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 14 మంది బాధితుల నుంచి ఎస్పీ నేరుగా అర్జీలు స్వీకరించి, వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. పోలీస్ స్టేషన్ కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగు తోందని పేర్కొన్నారు.

ఆశావర్కర్లకు కనీస వేతనం అందించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మీ

జగిత్యాల అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు కనీస వేతనంగా 26 వేలు అందించాలని సీఐటీయూ తెలంగాణ ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జగిత్యాలలో జరిగిన సీఐటీయూ మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఆశావర్కర్‌ల పట్ల తీవ్ర వివక్షను ప్రదర్శిస్తున్నదని విమర్శించారు. కరోనా కాలంలో ప్రాణాలకు తెగించి ప్రజల ప్రాణాలను కాపాడిన ఆశావర్కర్‌లను డబ్ల్యూహెచ్‌వో సహా అనేక అంతర్జాతీయ సంస్థలు ఆశావర్కర్‌ల సేవలను గుర్తించినప్పటికి కేంద్ర ప్రభుత్వం మాత్రం సరైన గుర్తింపు ఇవ్వడం లేదని ఆరోపించారు. నిర్దిష్టమైన పని గంటలు లేకుండా వెట్టి చాకిరీ చేయిస్తున్న ప్రభుత్వం కనీస వేతనాలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అర్హతను బట్టి ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు ఇందూరు సులోచన, కార్యదర్శి రాయికంటి దివ్య, వెంకటాచారి, కుంచం శంకర్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి గుగ్గిల్ల స్వప్న, మమత, దివ్య, లక్ష్మీ, వసంత, సరస్వతి, విజయరాణి, గాయత్రి పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

మాజీ మంత్రి జీవన్ రెడ్డి

రాయికల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇటిక్యాలలోని ఐకేపీలో కొనుగోళ్లు జరుగడం లేదని తెలుసుకున్న జీవన్‌రెడ్డి సోమవారం కేంద్రానికి చేరుకుని పరిశీలించారు. అధికారులతో, రైస్‌మిల్లర్లతో మాట్లాడి గన్నీ బ్యాగులను వెంటనే తీసుకురావాలని కోరారు. తేమ పరికరం పని చేయడం లేదని రైతులు తెలుపగా, వెంటనే తెప్పించి కొనుగోళ్లు జరిగేలా చూడాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజురెడ్డి, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గుర్రం మహేందర్ గౌడ్, మహిపాల్‌రెడ్డి, మండ రమేష్, ఆదిరెడ్డి, జలంధర్‌రెడ్డి, సత్యం, జీవన్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, రమేష్, సాగర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

రాయికల్ పట్టణంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న సాంబార్ శివ కుటుంబసభ్యులను సోమవారం మాజీ మంత్రి జీవన్ రెడ్డి పరామర్శించారు. అలాగే సౌదీలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తోట ధర్మయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజురెడ్డి, పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్, మండల ప్రధాన కార్యదర్శి గుర్రం మహేందర్ గౌడ్, మండ రమేష్, మహిపాల్ రెడ్డి, గంగాధర్, బాపురపు నర్సయ్య, బత్తిని భూమయ్య, నరేష్, శివ, ఎద్దండి లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివాహం చేయడం లేదని
తండ్రిని హత్య చేసిన కొడుకు
గతంలో తల్లిపైనా దాడి 6లో..

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి..
అడిషనల్ కలెక్టర్ రాజాగౌడ్ 8లో..

సబ్‌స్టేషన్ పనులు నిలిపివేయాలి

కథలాపూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్మిస్తున్న 220/132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను నిలిపివేయాలని కోరుతూ సోమవారం యువకులు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్‌కు వినతి పత్రం అందించారు. సబ్ స్టేషన్ నిర్మాణం వల్ల అధిక విద్యుత్ అయస్కాంత తరంగాలు వెలువడి దీర్ఘకాలిక వ్యాధులు సంభవించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. మానవులకు ప్రాథమిక సాంభవ్యత సమస్యలు, శబ్ద కాలుష్యం, దృశ్య ప్రభావం, విద్యుత్ అయస్కాంత క్షేత్రాల నుంచి వచ్చే ప్రభావం తీవ్రంగా ఉండనుందని పేర్కొన్నారు. కొనసాగుతున్న పనులు నిలివేసి మరోచోట సబ్‌స్టేషన్ నిర్మించాలని కోరారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి

బీర్‌పూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి):బాల్య వివాహాలను నిర్మూలించాలని బాల్య వివాహాల నిరోధకశాఖ సభ్యులు అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాలలో గల పాఠశాలలో, గ్రామ పంచాయతీ కార్యాలయాలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. మండలంలో రెండు రోజులు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొని విద్యార్థినులకు బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీ డీవో భీమేష్, శిశు సంక్షేమ శాఖ ఉద్యోగులు, పాఠ శాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **రాయికల్:** బాల్య వివాహాలు లేని భారత దేశమే లక్ష్యంగా అందరు కృషి చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరారు. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా రాయికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. సఖి కేంద్రం సైకో సోషల్ కౌన్సిలర్ గౌతమి బాల్య వివాహాల వలన కలిగే ఇబ్బందులు, భవిష్యత్‌లో వారు ఎదుర్కొనే అనారోగ్య సమస్యలు, కుటుంబ వ్యవస్థలో బాలికలకు కలిగే ఇబ్బందులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, ఎంఈవో రాఘవులు, హెచ్‌ఎం కాపు శ్రీనివాస్, ఏపీఎం నరహరి, ఉపాధ్యాయులు రాజశేఖర్, పద్మ, చెరుకు మహేశ్వర శర్మ, తరంగిణి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించాలి

జిల్లా విద్యాశాఖ అధికారి రాము



విజేతలను అభినందిస్తున్న డీఈవో రాము

జగిత్యాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాము అన్నారు. జిల్లా స్థాయి విద్యార్థి నైపుణ్య పోటీల్లో విద్యార్థుల రాణింపు అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి రాము అన్నారు. టీ శాట్ మరియు గెజిటెడ్ ప్రధా నోపాధ్యాయుల అసోసియేషన్ జగిత్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి, మేధస్సు సృజనాత్మక పెంపొందించడానికి సోమవారం జగిత్యాలలో జిల్లా స్థాయిలో వ్యాస రచన, ఉపన్యాస మరియు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ ఓ రాము మాట్లాడుతూ ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరు స్తున్నారన్నారు. జిల్లా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గంగనర్సయ్య మాట్లాడుతూ విద్యార్థులు మండలం మరియు జిల్లాపోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారని, గెలుపు ఓటములు సహజం అని అన్నారు. వ్యాస రచన పోటీలలో మొదటి స్థానంలో జిల్లా పరిషత్ పాఠశాల బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థిని సాత్విక, ఉపన్యాస పోటీలలో వెల్లుల్ల జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఎ శ్రీచరణ్, క్విజ్ పోటీలలో కొండాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఎ రణజయ్ విజేతలుగా నిలువగా అభినందించారు. వీరు రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారన్నారు.

కోతుల బెడదకు చెక్..



ఎలుగుబంటి వేషంలో తిరుగుతున్న పంచాయతీ కార్మికుడు

వేములవాడ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అడవుల్లో ఉండాల్సిన కోతులు గ్రామాల్లో తిరుగుతూ ఇళ్లలో బీభత్సం సృష్టిస్తున్నాయి. కోతులకు మహిళలు, వృద్ధులు, చిన్నారులు భయపడుతు న్నారు. దీంతో వట్టెంల గ్రామకార్యదర్శి కృష్ణమోహన్ కోతులను కట్టడి చేయాలని నిర్ణయించుకు న్నాడు. పంచాయతీసిబ్బందిలో ఒకరికి ఎలుగుబంటి వేషం వేయించి గ్రామంలో కోతులున్న చోట అతడిని తిప్పుతున్నాడు. కోతులు ఎలుగుబంట్లకు భయపడుతాయని, ఈ పద్ధతి సత్ఫలితాలను ఇస్తుందని తెలుసుకుని అవలంబిస్తున్నట్లు కార్యదర్శి తెలిపాడు.

ద్విచక్రవాహనం ఢీకొని ఒకరికి గాయాలు

హుజూరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆగిఉన్న బైక్‌ను మరో బైక్ వచ్చి ఢీకొట్టిన ఘటనలో సోమవారం ఒకరికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. హుజూరాబాద్ పట్టణానికి చెందిన గడ్డం హర్షవర్ధన్ కాంగ్రెస్ కార్యాలయం ఎదుట తన ద్విచక్రవాహనాన్ని ఆపి మిత్రులతో మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో ఓ యువకుడు బైక్‌ను అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి హర్షవర్ధన్ బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో హర్షవర్ధన్‌కు గాయాలవడంతో ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదాల నివారణకు కసరత్తు

- రోడ్ సేఫ్టీ అధికారుల బృందం పర్యటన
- ప్రమాద స్థలాల గుర్తింపు, నివారణ చర్యలకు సూచనలు



సుల్తానాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహదారిపై తరుచూ రోడ్డు ప్రమాదాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. ప్రజల ప్రాణల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించగా, రోడ్ సేఫ్టీ అధికారుల బృందం సోమవారం రహదారిని పరిశీలించింది. ఆర్‌అండ్‌బీ ఈఈ బాబు సింగ్, ట్రాఫిక్ సీఐ అనిల్ కుమార్, సీఐ సుబ్బారెడ్డి, రోడ్డు నిర్మాణసంస్థ అధికారులు పాల్గొన్నారు.

● ఆక్రమణల తొలగింపునకు చర్యలు..

రాజీవ్ రహదారిని ఇరువైపులా ఆక్రమించుకొని దుకాణాలు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రమేష్ తెలిపారు. మూడు రోజుల క్రితం జిల్లా కేంద్రంలో కలెక్టర్ రోడ్ సేఫ్టీ కమిటీ అధికారులతో సమావేశం నిర్వహించి, రాజీవ్ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందులో భాగంగా రహదారి ఆక్రమణలు తొలగించాలని సూచించారని ఈ మేరకు సోమవారం రోడ్ సేఫ్టీ అధికారుల బృందం సుల్తానాబాద్‌లో పర్యటించిందని పలు శాఖల అధికారుల సూచనల మేరకు రోడ్డు సెంటర్ నుంచి 50 ఫీట్ల వరకు వెడల్పు చేసే కార్యక్రమాన్ని చేపడుతున్నామ న్నారు. రోడ్డు మధ్య నుంచి వరువైపులా 50 ఫీట్ల వరకు ఎలాంటి ఆక్రమణలు ఉండకుండా తొలగించుకోవాలని యజమానులకు సూచించారు. వారు తొలగించకపోత రోడ్డు సేఫ్టీ అధికారుల కమిటీ ఆధ్వర్యంలో ఆక్రమణలు తొలగిస్తామన్నారు.

● సుల్తానాబాద్ పట్టణంలో రోడ్డు ఆక్రమణలు...

సుల్తానాబాద్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి శాస్త్రీనగర్ వరకు రాజీవ్ రహదారిని రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాదారులు ఇంటి యజమానులు ఆక్రమించారు. మరికొందరు కాలువలను కూడా ఆక్రమించుకొని నిర్మాణాలు చేయడంతో ప్రమాదాలకు కారణమవుతోంది. బస్టాండ్ నుంచి తెలంగాణ చౌక్ వరకు హోటళ్ళు, ఇతర దుకాణాల మూలంగా వాహనదారులు హోటళ్లకు వెళ్లడానికి వాహనాలను రోడ్డుపైనే నిలుపుతున్నారు. దీంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. రోడ్డు ఆక్రమించడంతో రహదారిపై వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి

● ఎస్సారెస్పీ కాలువపై వంతెన నిర్మాణ ప్రతిపాదనలు

ఈ ప్రాంతంలో అత్యధికంగా రైస్‌మిల్లులు ఉన్న కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాలువ మీదుగా వంతెన నిర్మించడం వల్ల రైస్‌మిల్లు నుంచి వచ్చే లారీలు నేరుగా యూటర్న్ నుంచి వెళ్లేలా ప్రతిపా దనలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. రైస్‌మిల్లులకు చెందిన లారీలు రాంగ్ రూట్లో రా వడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, ఎస్సా రెస్పీ కాలువపై వంతెన నిర్మాణం చేపట్టాలని సిఫార్సు చేశారు. కాట్నపల్లి సమీపంలోని కోమండ్ల పల్లి రోడ్డు నుంచి లారీలు రాంగ్ రూట్‌లో కాట్న పల్లి వైపు వస్తున్నాయని, ఇలా రావడం వల్ల ప్రమా దాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాల నివారణకు అక్కడికి యూటర్న్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

● ప్రమాద స్థలాల పరిశీలన..



రైసు మిల్లుల ప్రాంతంలో పరిశీలిస్తున్న రోడ్ సేఫ్టీ అధికారులు

రోడ్ సేఫ్టీ అధికారుల బృందం రహదారిపై గతంలో ప్రమాదాలు జరిగిన పలు ప్రాంతాలను సందర్శించింది. మలుపుల వద్ద కనీస హెచ్చరిక బోర్డులు లేకపోవడం, వేగ నియంత్రణ సూచనల లేమి, రోడ్డు భద్రత నియమ నిబంధనల పై ప్రజలకు అవగాహన లేకపోవడం, రహదారి పక్కన అనధికారిక నిర్మాణాలు, ఆక్రమణలు వల్ల ప్రమా దాలు జరుగుతున్నట్లు గుర్తించారు. ప్రత్యేకంగా రైస్‌మిల్లులు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో వాహనాల రాకపోకలు అధికంగా ఉండటం, రోడ్డు పక్కన పార్క్ చేసే లారీలు, ఇతర వాహనాలు ప్రమాదా లకు కారణమవుతున్నాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

పోలీసుల పేరిట చోరీ

సుల్తానాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పోలీసులమంటూ ఓ ఇంటికి ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి ఆరుతులాల బంగారం, పదివేల నగదును తీసుకెళ్లారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామానికిచెందిన రమేష్ కరీంనగర్‌లోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో పనిచేస్తున్నాడు. సోమవారం ముగ్గురు వ్యక్తులు రమేష్ ఇంటికివచ్చి తలుపుకొట్టగా తల్లి లక్ష్మి తెరిచింది. ముగ్గురు వ్యక్తులు ఇంట్లోకి జొరబడి ఇల్లంతా తనిఖీచేశారు. బీరువా తెరిపించి అందులోని ఓ బ్యాగును తీసుకున్నారు. అందులో ఆరుతులాల బంగారం, పదివేల నగదు ఉండగా వాటిని స్వాధీనం చేసుకుని మీరు రేపు కరీంనగర్ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి నగలు, నగదు తీసుకెళ్లాలని, అక్కడ అధికారులు విచారిస్తారని చెప్పి ఉడాయించారు. వచ్చిన ఆగంతకులు పోలీసులుకాదని నిర్ధారించుకొనిబాధితులు పోలీసులకుఫిర్యాదు చేశారు.

మద్యం షాపుల్లో చోరీలు

కోల్‌సిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని కూరగాయల మార్కెట్ సమీపంలోని రెండు మద్యం షాపుల్లో ఆదివారం రాత్రిచోరీ జరిగింది. వెనుకవైపు ఉన్న కిటికీల్లో నుంచిలోనికి దూరిన అగంతకులు కౌంటర్‌లోఉన్న చిల్లరడబ్బులు, 5పెట్టెల మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లినట్టు నిర్వాహకులు పేర్కొన్నారు. రెండు షాపుల్లో సీసీ కెమెరాల డీవీఆర్‌లను ఎత్తుకెళ్లారు. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు, క్లూస్ టీమ్ ఘటన స్థలంలో పరిశీలన జరిపారు.

ఖని జనరల్ ఆసుపత్రిలో దొంగల చేతివాటం

● రోగుల అటెండర్ల నుంచి డబ్బులు, సెల్‌ఫోన్లు మాయం

కళ్యాణ్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో దొంగలు చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. సోమవారం గోదావరిఖనికి చెందిన ప్రసాద్ భార్య ప్రసవం కాగా ఆయన బయట ఉన్న రెస్ట్‌హాల్‌లో నిద్రిస్తుండగా సెల్‌ఫోన్‌నుదొంగలు ఎత్తుకెళ్లారు. బెల్లంపల్లికి చెందిన ప్రభాకర్ భార్య ఆసుపత్రిలో చికిత్సపొందుతుండగా రెస్ట్ రూమ్‌లో నిద్రిస్తుండగా అతనిజేబులో నుంచి డబ్బులను కొట్టేశారు. చోరీలపై ఆసుపత్రి ఆర్ఎంవో రాజుకు ఫిర్యాదు చేయగా పోలీసులకు సమాచారం అందించారు. రెస్ట్‌రూమ్‌లో సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలని రోగుల అటెండర్లు కోరుతున్నారు.

దొంగతనం కేసులో జైలు శిక్ష

సుల్తానాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గర్రెపల్లిలో 2024లో జరిగిన ఓ దొంగతనం కేసుకు సంబంధించి నిందితునికి సుల్తానాబాద్ కోర్టు జూనియర్ సివిల్‌జడ్జి 18నెలల జైలుశిక్ష, వంద రూపాయల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పుచెప్పారు. తాళంవేసి ఉన్న ఓఇంటిలో 2024లో ఖమ్మంకు చెందిన గుర్రం కోటేశ్వర్ దొంగతనానికి పాల్పడ్డాడు. ఇంట్లో ఉన్న రెండులక్షల నగదు, బంగారు ఆభరణాలు చోరీచేశాడు. పోలీసులు కేసు నమోదుచేయగా తగినసాక్ష్యాధారాలు కోర్టులో ప్రవేశ పెట్టడంతో కోటేశ్వర్‌కు జైలుశిక్ష విధిస్తూ జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేష్ తీర్పు చెప్పారు.

అప్పుల బాధతో రైతు బలవన్మరణం



మల్లేశం(ఫైల్)

గన్నేరువరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన బోయిని మల్లేశం(45) అనే రైతు అప్పులబాధతో పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై నరేందర్‌రెడ్డి, స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లేశం తనకున్న రెండెకరాల్లో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇటీవల కురిసిన వర్షాలకు వరిపంట నేలకొరిగి నష్టపోయాడు. రెండేళ్ల కిందట తన కూతురు అనారోగ్యంతో మృతి చెందింది. ఆర్థిక ఇబ్బందులతో పదిలక్షల రూపాయల వరకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురై ఈనెల 5న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడు. మల్లేశం భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య



జలంధర్(ఫైల్)

తంగళ్లపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన మచ్చ జలంధర్(60) ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కథనం ప్రకారం.. కొంతకాలంగా జలందర్ అనారోగ్యసమస్యలతో బాధపడుతున్నాడు. కాళ్లనొప్పులు తదితర అనారోగ్య సమస్యల ఉండడంతో మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య పద్మ ఉంది. ఈ సంఘటనపై పోలీసులు కేసునమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ బావిలో పడి యువకుడి మృతి



శ్యాంరాజ్(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తారుపల్లిలో ప్రమాదవశాత్తు బావిలోపడి సూరం శ్యాంరాజ్(24) అనే యువకుడు మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు చెప్పిన ప్రకారం.. సూరం శ్యాంరాజ్ ఆదివారం సాయంత్రం పత్తిచేను వద్దకు వెళ్లాడు. అతను ఇంటికి రాకపోయేసరికి కుటుంబసభ్యులు ఎక్కడవెతికినా జాడ కనిపించలేదు. సోమవారం ఉదయం చేను పక్కన ఉన్న ఒక రైతు వ్యవసాయ బావి ముందు సూరం శ్యాంరాజ్ చెప్పులు విడిచి ఉండటంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి వెతికారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ జగదీశ్వర్‌రావు వ్యవసాయ బావిని పరిశీలించి గజ ఈతగాళ్లను పిలిపించి వెతకగా శ్యాంరాజ్ మృతదేహం కనిపించింది. మంచినీటి కోసం వెళ్లి ప్రమాదవశాత్తుబావిలో జారిపడినట్లుగా కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. శ్యాంరాజ్ బసంత్‌నగర్‌కు చెందిన అమ్మాయితో వివాహం కుదిరింది. ఈ నెల 23న పెళ్లి నిశ్చయం కాగా ప్రమాదం జరగడంతో కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు కలచివేసింది. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి



కొంరయ్య మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

వీణవంక, నవం బరు 10 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని ఎల్బాక గ్రామానికి చెందిన నల్లగోని కొంరయ్య(55) అనే గీత కార్మికుడు సోమవారం తాటిచెట్టు పైనుంచి జారిపడి మృతిచెందాడు. వృత్తిలో భాగంగా కొంరయ్య సోమవారం సాయంత్రం చెట్టుఎక్కి కొమ్మలు తీస్తున్నాడు. ఈ క్రమంలో కాలు జారి కిందపడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గౌడ సంఘం నాయకులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మంథనిరూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపూర్- నాగేపల్లి గ్రామాల శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమవారం యువకుడు మృతిచెందాడు. మంచిర్యాలకు చెందిన తాళ్లూరి సాయిశ్రావణ్(30) అనేయువకుడు శ్రీరాంపూర్‌లో సింగరేణిలో ఉద్యోగం చేస్తుండగా శిక్షణలో భాగంగా భూపాలపల్లికి వెళ్లి మంథని వైపు వస్తున్నాడు. ఈక్రమంలో బైకు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో శ్రావణ్ అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

ప్రతి రోజూ పచ్చి పులుసు పెడతారా..?

- భోజనం నాసిరకంగా ఉంటోంది..
- ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులపై విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం
- జమ్మికుంట ప్రభుత్వ ప్రాథమిక బాలికల పాఠశాలలో ఫుడ్ పాయిజన్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని

జమ్మికుంట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): 'పిల్లలకు ప్రతిరోజు పచ్చి పులుసు పెడుతున్నారు. దీంతో పిల్లలు కడుపు నొప్పి అంటున్నారు. నాసిరకం కోడిగుడ్లు, కూరగాయలతో వంటలు చేస్తున్నారు. మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత కడుపునొప్పిగా ఉంటుందని పిల్లలు అంటున్నారు. ఈ విషయంపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు.. ఈ రోజు పరిస్థితి తీవ్రంగా మారింది. 26 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.. బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలి'.. ఇది జమ్మికుంట ప్రభుత్వ ప్రాథమిక బాలికల పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదన. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి 26మంది విద్యార్థులు సోమవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పచ్చి పులుసు, అలసంద, ఆలుగడ్డ, టమాట, కోడిగుడ్డుతో భోజనం చేశారు. తిన్న తర్వాత తరగతి గదిలోకి వెళ్లిన వారిలో 26మంది కడుపునొప్పి, వాంతులు, విరోచనాలతో బాధపడ్డారు. ఉపాధ్యాయులు వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు 14 మందిని అడ్మిట్ చేసి, మరో 12 మందికి మందులు ఇచ్చి పంపించారు. నాసిరకం కోడిగుడ్లు తినడంతో విద్యార్థినులకు ఫుడ్‌పాయిజన్ అయ్యిందని, విద్యార్థుల పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. మధ్యాహ్న భోజనం నాసిరకంగా ఉంటోందని, కూరగాయలు, నూనె, కోడిగుడ్లు, మసాలాలు, చింతపండు, ఇతర పదార్థాలు అధ్వానంగా ఉన్నాయని మండిపడ్డారు. ఈ విషయంపై పలుమార్లు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఫిర్యాదు చేసినా పటించుకోలేదని విమర్శించారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ వెంకటరెడ్డి, ఎంఈవో హేమలత అక్కడికి చేరుకొని విచారణ చేపట్టారు.

● మెరుగైన వైద్యం అందించండి

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

భగత్‌నగర్: అస్వస్థతకు గురైన విద్యార్థినులకు మెరుగైనవైద్యం అందించాలని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండిసంజయ్ అన్నారు. విద్యార్థినులు ఫుడ్‌పాయిజ్‌తో ఆస్పత్రిలో చేడంతో వారి ఆరోగ్య పరిస్థితిపై కలెక్టర్ పమేలాసత్పతితో ఫోన్‌లో మాటాడారు. అవసరమైతే మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించాలని సూచించారు.

● ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఇలాంటి ఘటనలు

- ఎంపీ ఈటల రాజేందర్

జమ్మికుంట: రాష్ట్రప్రభుత్వ నిర్లక్ష్యంతో తరుచూ ఇలాంటి సంఘ టనలు జరుగుతున్నాయని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనపై అధికారులతో మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

● విద్యార్థుల ఆరోగ్యం ముఖ్యం

- మంత్రి పొన్నం ప్రభాకర్

జమ్మికుంట: విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయమై మంత్రి స్పందించారు. ఉన్నతాధి కారులతోపాటు సీనియర్ నాయకుడు దేశిని కోటికి ఫోన్‌చేసి సంఘటనపై తెలుసుకున్నారు. విద్యార్థినుల ఆరోగ్యం ముఖ్యమని, మెరుగైన వైద్యం అందించాలని అన్నారు. మధ్యాహ్న భోజనం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గంజాయి పట్టివేత

ఎల్లారెడ్డిపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామశివారులోని సీతారామచంద్రస్వామి ఆలయం కమాన్‌వద్ద ఇద్దరు యువకుల నుంచి 100గ్రాముల ఎండు గంజాయిని పట్టుకున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి సోమవారం తెలిపారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన యువకులు మామిండ్ల విశాక్, మరాఠి విక్కీలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. మండలంలోని గ్రామాల్లో సాగుతున్న గంజాయి విక్రయాలపై తమకు, 100 డయల్‌కు సమాచారం అందించాలని కోరారు.

రాయపట్నం శివారులో..

ధర్మపురి : ధర్మపురి మండలం రాయపట్నం శివారులో ఎస్ఐ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేసి మంచిర్యాలకు చెందిన తగరపు రాజు అనే వ్యక్తివద్ద 130గ్రాముల గంజాయి సోమవారం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రాజుపై కేసు నమోదుచేశారు. యువత ఎలాంటి మత్తు పదార్థాలు, గంజాయి,మాదకద్రవ్యాలకు బానిస కాకూడదని అన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాలను ఎవరైనా సరఫరా చేస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లందకుంట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాములపల్లెకు అక్రమంగా ఇసుకతరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై క్రాంతికుమార్ తెలిపారు. జమ్మికుంట మండలంలోని విలాసాగర్ నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్‌ను స్టేష న్‌కు తరలించినట్లు, ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎంబీఏ రెండు, నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జూలై 2025లో నిర్వహించిన ఎంబీఏ రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను సోమవారం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్ విడుదల చేశారు. ఫలితాలను శాతవాహనవెబ్‌సైట్ www.satavahana.ac.inలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

గంగాధర, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం రంగరావుపల్లిలో ఓ ఇంట్లో నిలువఉంచిన రేషన్‌బియ్యాన్ని సోమవారం విజిలెన్స్, సివిల్‌సప్లయి అధికారులు పట్టుకున్నారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ వివరాల ప్రకారం.. రంగరావుపల్లిలోని ఓ ఇంటిని రమేష్ అనే వ్యక్తి నెలరోజుల క్రితం అద్దెకు తీసుకున్నాడు. గ్రామాల్లో సేకరించిన రేషన్‌బియ్యాన్ని నాలుగు గదుల్లో నిలువ ఉంచాడు. సమాచారం అందుకున్న అధికారులు దాడులు నిర్వహించారు. బియ్యాన్ని రెండువ్యాన్లలో లోడు చేసి జిల్లాకేంద్రానికి తరలించారు. సుమారు 140క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు సమాచారం. దాడుల్లో జిలెన్స్ అధికారి వరుణ్‌ప్రసాద్, సివిల్ సప్లయి డీటీ ఉషారాణి ఉన్నారు.



పట్టుకున్న రేషన్ బియ్యం బస్తాలు

తల్లిదండ్రులను ఇంటి నుంచి వెళ్లగొట్టిన కొడుకు

● పోలీసులకు ఫిర్యాదు ● ప్రజావాణిలో కలెక్టర్‌ను ఆశ్రయించిన వృద్ధ దంపతులు

సుల్తానాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఉన్న తండ్రిని పట్టించుకోకుండా ఇంటి నుంచి వెళ్ళకొట్టిన సంఘటన పెద్దపల్లిజిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో సోమవారం చోటుచేసుకొంది. కొడుకు కోడలి పై చట్టపరమైన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని దంపతులు పోలీసులను ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామానికి చెందిన లచ్చయ్య ప్రమీల దంపతులకు ఐదుగురు కుమారులు. అందరూ స్థిరపడ్డారు. లచ్చయ్య సింగరేణి ఉద్యోగం చేసి పదవీ విరమణ పొంది రామకృష్ణాపూర్‌లో ఉంటున్నాడు. పిల్లలను పెంచి పెద్దచేసి వారిని ప్రయోజకులుగా చేశారు.

నెల రోజుల క్రితం ఫైల్స్ ఆపరేషన్ చేసుకున్న లచ్చయ్య స్వగ్రామం కాట్నపల్లికి వచ్చాడు. లచ్చయ్యకు చెందిన ఇంటిలో పెద్దకుమారుడు ఉంటుండగా అతడితో కలిసి ఉన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు, ఆస్పత్రికి తీసుకు వెళ్లడంలో, ఇతర సహాయ పనులు చేయడంలో ఏ కొడుకూ ముందుకు రాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటికి వచ్చిన తమను కొడుకు కోడలు తిండి పెట్టకుండా మానసికంగా, శారీరకంగా కష్టపెట్టారని, దూషిస్తు ఇంటి నుంచి బయటకు వెళ్ళగొట్టారన్నారు. ఆస్తులు అనుభవించడమే కాకుండా తమను ఇంటి నుంచి గెంటేసిన కొడుకు, కోడలుపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సదరు కొడుకు పెద్దపల్లిలో ప్రభుత్వ ఉద్యోగిగా పని చేస్తున్నాడని దంపతులు తెలిపారు. ఫిర్యాదుపై పోలీసులు విచారణ చేపడుతున్నారు.



పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్ ఎదుట దంపతులు

పెళ్లి చేయడం లేదని తండ్రిని చంపిన తనయుడు

● గతంలో తల్లిపైనా దాడి



గంగనర్సయ్య(ఫైల్)

మెట్‌పల్లి టౌన్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేయడం లేదని జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని దుబ్బవాడకు చెందిన ఎల్ల గంగనర్సయ్య(74) అనే వృద్ధుడిని అతడి కుమారుడు అన్వేష్ తలపై కర్రతో ఆదివారం దాడి చేయగా సోమవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గంగనర్సయ్యకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కాగా అన్వేష్ హోటల్ మేనేజ్‌మెంట్ పూర్తిచేసి ఐదేళ్లుగా ఇంటివద్దనే ఖాళీగా ఉంటున్నాడు. తనకు పెళ్లి చేయాలని, తన గురించి పట్టించుకోవాలని అన్వేష్ పలుమార్లు ఇంటిలో గొడవలు చేశాడు. ఐదు నెలల క్రితం ఇంట్లో గొడవలు జరగ్గా తల్లి రమాదేవిని అన్వేష్ కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలై మంచానికే పరిమితమైంది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో జైలుకు వెళ్లాడు. కాగా తండ్రి ఎల్ల గంగనర్సయ్య కొడుకు మీద ప్రేమతో బెయిల్ మీద జైలు నుంచి విడిపించారు. అన్వేష్ ప్రవర్తనలో మార్పు రాకపోగా తనకు వివాహం చేయడం లేదని ఆదివారం తండ్రి ఎల్ల గంగనర్సయ్యపై కర్రతో దాడి చేశాడు. దీంతో గాయాలతో నర్సయ్య ఇంట్లో పడిపోయాడు. కాగా దాడి విషయాన్ని అన్వేష్ తన చిన్నబావకు తెలపగా నర్సయ్యను మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో సోమవారం ఎల్ల గంగనర్సయ్య మృతిచెందాడు.

మృతుడి చిన్నకుమార్తె హారిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉంటే అన్వేష్ ఒక సైకోలా వ్యవహరిస్తాడని, ఎప్పుడు ఎలా ఉంటాడో అర్థం కాదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.

మాయమైపోయిన.. మన అందెశ్రీ..

● జిల్లాతో సన్నిహిత సంబంధం



2013లో ఉగాది కవి సమ్మేళనంలో అందెశ్రీ(ఫైల్)

కరీంనగర్ కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పశుల కాపరి నుంచి పాటను ప్రపంచస్థాయికి తీసుకెళ్లిన ప్రముఖకవి, గేయ రచయిత డాక్టర్ అందెశ్రీ ఇకలేరు. తీవ్రఅనారోగ్యంతో సోమవారం హైదరాబాద్‌లోని తననివాసంలో గుండెపోటుతో ఒక్కసారిగా కూలిపోయి మృతి చెందారు. ఉమ్మడిజిల్లాతో ఆయనకు సన్నిహిత సంబంధం ఉంది. కరీంనగర్‌లో 2001డిసెంబరు 8న ఎస్‌ఆర్‌ఆర్ డిగ్రీకళాశాలలో జరిగిన తెలంగాణ మాండలిక సాహిత్యం సదస్సుకు వచ్చారు. 2014లో జరిగిన ఎస్నీల ముచ్చట్ల ప్రథమ వార్షికోత్సవానికి, 2017లో జరిగిన ఎస్నీల ముచ్చట్ల నాలుగో వార్షికోత్సవానికి హాజరయ్యారు. జూలపల్లిలో ఎన్నారై ఆకెనపల్లి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన శివాలయ ప్రతిష్ఠ ప్రాంభోత్సవంలో అందెశ్రీ పాల్గొన్నారు. 2013లో ఉగాది కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. గతనెల19న అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో అన్నవరం దేవేందర్ కవితా సంపుటి ఆవిష్కరణకు హాజరయ్యారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు అక్కపల్లి శివారులో సోమవారం రాత్రి జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మండల కేంద్రం శివారులో సింగారం గ్రామానికి చెందిన రాము అతని స్నేహితుడు రమేశ్‌తో కలిసి బైక్‌పై సిరిసిల్ల నుంచి ఎల్లారెడ్డిపేటకు వస్తున్న క్రమంలో గుర్తు తెలియని ద్విచక్రవాహనం వెనుక నుంచి ఢీకొట్టి పారిపోయింది. గంభీరావుపేట మండలం గజసింగవరంలోని నవీన్ తన మిత్రుడితో కలిసి వీర్నపల్లి నుంచి ఎల్లారెడ్డిపేట వైపుకు వస్తూ అక్కపల్లి గ్రామశివారులో ప్రధాన రహదారిపై ఉన్న ధాన్యం కుప్పలను ఢీకొని గాయాలపాలయ్యాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

రాజన్న దర్శనానికి ఇబ్బందులు

● గుడి బయట టెంకాయిలు కొట్టి వెళ్లిన భక్తులు
● అందినకాడికి దండుకున్న దళారులు

వేములవాడ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా వేములవాడలో సోమవారం రాజరాజేశ్వరస్వామి దర్శనానికి ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆలయంలో స్వామివారికి వీఐపీ భక్తులకు దర్శనం సులభమే అయినప్పటికీ సామాన్య భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. ఆలయ ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు స్వామివారి దర్శనం చేసుకునేందుకు ఓపికలేని అనేకమంది భక్తులు ఆలయ మెట్ల వద్దనే టెంకాయలు కొట్టి తిరుగుముఖం పట్టారు. సామాన్య భక్తుల అవసరాలను ఆసరాగా తీసుకొని దళారులు అండినకాడికి దండుకున్నారు. రాజన్న దర్శనానికి వెళ్లేందుకు ఏ క్యూలైన్ వైపు వెళితే దర్శన భాగ్యం కలుగుతుందో తెలియక అటుఇటు తిరుగుతున్న భక్తులను దళారులు డబ్బులు తీసుకొని క్యూలైన్‌ల వైపు తీసుకెళ్లారు. రాజన్న ఆలయం వద్ద ఒక్కసారిగా రద్దీ పెరగడంతో రాజగోపురం ఎదురుగా ఉన్న గేటుతో పాటు దక్షిణం వైపున్న మెట్ల ప్రధాన గేటు మూసివేసి ఆంక్షలు విధించారు. ఆదివారం భక్తులు ఒకేసారి తోసుకొని రావడంతో ముందస్తు చర్యలు చేపట్టారు. దీంతో స్వామివారి దర్శనా నికి వచ్చిన భక్తులు ఎటువైపు వెళ్లాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. సులభ్ కాంప్లెక్స్ వైపు ఉన్న మెట్ల ద్వారా భక్తులకు సాధారణ దర్శన క్యూలైన్‌లోకి అనుమతి ఇచ్చారు. ఈ క్యూలైన్ వైపు వెళ్లే దారి తెలియక భక్తులు దక్షిణ ద్వారం వైపే నిలిచి పోయారు. వికలాంగులు, వృద్ధులు, వీఐపీలు వచ్చిన సమయంలో పోలీసులు అప్పుడప్పుడు గేటు తీసి లోనికి అనుమతించారు. దీంతో భక్తులు పోలీసులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజన్న దర్శనం చేసుకొని వెళ్లేవారికి మధ్యాహ్నం 2గంటలకు ఉత్తరద్వారం నుంచి అవకాశం కల్పించారు. అయితే రాజగోపురం వద్ద అనౌన్స్‌మెంట్ లేకపోవడంతో భక్తులు ఎటు వెళ్లాలో తెలియలేదు. ఇక్కడ మైక్ ఏర్పాటుచేసి తరుచుగా భక్తులకు సూచనలు చేయాల్సిన అవసరం ఉంది. ఆలయంలో రద్దీ పెరగడంతో తలనీలాలు సమర్పించేందుకు భక్తులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. రాజన్న దర్శన భాగ్యం లభించని భక్తులు భీమేశ్వరాలయానికి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు.



ఆలయ ప్రధాన ద్వారం మూసివేసివేయడంతో నిరీక్షిస్తున్న భక్తులు

● రాజన్న సన్నిధిలో భక్తజనసంద్రం

వేములవాడ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం సోమవారం భక్తజనసంద్రమైంది. దాదాపు 50వేలకు పైగా భక్తులు తరలివచ్చి రాజన్నకు మొక్కులు చెల్లించారు. దీంతో ఆలయానికి దాదాపు రూ.40లక్షల ఆదాయం సమకూరింది. స్వామివారి లఘు దర్శనానికి కనీసం మూడు గంటల సమయం పట్టింది. ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. వేలాదిమంది భక్తులు తలనీలాలు సమర్పించారు. కార్తీక మాసం సందర్భంగా భీమేశ్వరస్వామి దేవస్థానంలో వేలాదిమంది భక్తులు కోడెల మొక్కులు చెల్లించారు. ఆలయంలో స్వామివారికి భక్తులు అభిషేక పూజలు చేశారు. కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి 11మంది రుత్వికులతో మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతలకు అర్చనలు నిర్వహించారు. రాత్రి స్వామివారికి అర్చకులు మహాలింగార్చన నిర్వహించారు. రాజరాజేశ్వరస్వామి, భీమేశ్వరస్వామివారిని దర్శించుకున్న భక్తులు బద్దిపోచమ్మకు బోనాలు సమర్పించారు. కార్తీకమాసం సందర్భంగా భీమేశ్వరాలయం వద్ద కార్తీక దీపోత్సవం నిర్వహించారు. సోమవారం రాత్రి సుహాసినీలు భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు.

● రాజన్న ఆలయంలో పర్యవేక్షించిన ఈవో రమాదేవి

భక్తుల రద్దీ పెరగడంతో రాజన్న ఆలయంలో ఈవో రమాదేవి పర్యవేక్షించారు. రద్దీ పెరగడంతో ఈఈ రాజేష్‌తో చర్చించి ఉత్తర ద్వారం వైపు నుంచి భక్తులు వెళ్లేందుకు అనుమతిచ్చారు. భీమేశ్వరాలయంలోనూ ఈవో పర్యవేక్షించారు. భీమన్న సన్నిధిలో ఏఈవో శ్రావణ్‌కుమార్, సూపరింటెండెంట్‌లు నూగూరి నరేందర్, శ్రీనివాస శర్మలు భక్తులకు ఏర్పాట్లు చేశారు. ఆలయంలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అడిషనల్ ఎస్పీ చంద్రయ్య ఆధ్వర్యంలో 50మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేశారు.

నేటి నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాలల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీలను నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లాకార్యదర్శి బాసబోయిన వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బిర్లా ఇంటర్నేషనల్ స్కూల్‌లో అండర్-14,-17విభాగాల్లో బాలబాలికలకు జోనల్ స్థాయి స్క్వాష్, సాఫ్ట్‌టెన్నిస్ పోటీలను, జిల్లా కేంద్రంలోని క్రీడాపాఠశాలలో అండర్-14,-17బాల బాలికలకు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ నిర్వహించనున్నారు. ఈనెల 12న చింతకుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో జోనల్‌స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలను అండర్-14విభాగంలో బాలబాలికలకు నిర్వహిస్తారు. ప్రాంతీయ క్రీడాపాఠశాలలో జోనల్ స్థాయి అథ్లెటిక్స్ ఎంపికపోటీలను అండర్-14,17 విభాగాలలో బాలబాలికలకు నిర్వహించనున్నారు. ఈనెల 13న జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో జోనల్ స్థాయి స్కేటింగ్ పోటీలను అండర్-11,-14,-17 బాలబాలికల విభాగాల్లో నిర్వహించనున్నారు. మల్కాపూర్ రోడ్‌లోని చాంపియన్ క్రికెట్‌అకాడమీలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను అండర్-14 బాలుర విభాగంలో నిర్వహిస్తారు. క్రీడాకారులు ఎస్‌జీఎఫ్ ఎల్‌జిబిలిటీ ఫామ్‌తోపాటు పాఠశాల బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో హాజరుకావాలని కార్యదర్శి సూచించారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా వరద

జగిత్యాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి సోమవారం స్వల్పంగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతం నుంచి 9,454క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 80.5టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.501టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్‌భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టునుంచి 9,454క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

వైభవంగా లక్ష్మీనృసింహస్వామి రథోత్సవం

● దర్శనానికి బారులు తీరిన భక్తులు

పెద్దపల్లి రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవునిపల్లి లక్ష్మీనృసింహస్వామి రథోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. 9రోజుల నుంచి స్వామివారి బ్రహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. చివరిరోజు సోమవారం రథోత్సవం (జాతర)తో జాతర ముగిసింది. రథోత్సవంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఉమ్మడి కరీంనగర్‌తోపాటు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. ఉదయం స్వామివారిని రథంపై ఊరేగించారు. వాడవాడలా స్వామివారిని ఊరేగించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రథంపై ఉన్న స్వామివారికి కోళ్లు, మేకలతో మొక్కులు సమర్పించారు. గుట్టపై ఉన్న స్వయంభూ లక్ష్మీనృసింహ స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సతీమణి పావని, కుమార్తె వైష్ణవి దర్శించుకొని పూజలు చేశారు. బీజేపీనాయకుడు నల్ల మనోహర్‌రెడ్డి దర్శించుకున్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏసీపీ గజ్జి కృష్ణ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. జాతరకు వచ్చే భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఆలయ చైర్మన్ సదయ్య, ఈవో ముద్దసాని శంకర్, పంచాయతి అధికారులు కృషి చేశారు. గుట్టపై ఉన్న లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా బారులు తీరగా పోలీసులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. విద్యుత్, మంచి నీరు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్, ట్రాఫిక్‌సీఐ అనిల్‌కుమార్, రూరల్‌ఎస్‌ఐ మల్లేష్, సుల్తానాబాద్, పెద్దపల్లి సర్కిల్ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు బొక్కల సంతోష్, అర్చకులు శ్రీకాంతచార్యులు, నరసింహచార్యులు పాల్గొన్నారు. ఆలయానికి వచ్చే వాహనదారులకు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసిన ప్రైవేట్ వ్యక్తులు డబ్బులు వసూలు చేశారు. ఆలయ అధికారులతో సంబంధం లేదని నిర్వాహకులు చెప్పడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు.



ఆలయంలో బారులు తీరిన భక్తులు



రథం వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థుల ఫీజు చెల్లింపు

● చెక్కు రూపంలో అందించిన బీజేపీ నాయకులు



కలెక్టర్ పమేలా సత్పతికి చెక్కు అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

కరీంనగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని పదోతరగతి విద్యార్థుల పరీక్ష ఫీజును కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ చెక్ రూపంలో ఆయా జిల్లాల కలెక్టర్లకు చెల్లించారు. మోదీ గిఫ్ట్ పేరుతో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి చదివే విద్యార్థుల పరీక్షఫీజు చెల్లించనున్నట్లు బండి సంజయ్ ఇటీవల కలెక్టర్లకు లేఖలు రాశారు. ఇందులో భాగంగా ఆయాజిల్లాల కలెక్టర్లకు పార్టీ చెక్కులు అందజేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గం పరిధిలోని ప్రభుత్వపాఠశాలల్లో 12వేలమంది పదోతరగతి విద్యార్థులు ఉన్నారు. కరీంనగర్ 4,363మంది, సిరిసిల్ల 3948, సిద్దిపేట 1013, జగిత్యాల 1434, హన్మకొండలో 690మంది ఉన్నారు. కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ తరపున కరీంనగర్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతికి, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిని గోపి అక్కడి ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్‌కు, సిద్దిపేటజిల్లా మాజీఅధ్యక్షుడు మోహన్‌రెడ్డి, జగిత్యాల, హన్మకొండజిల్లాల నాయకులు ఆయా కలెక్టర్లను కలిసి పరీక్ష ఫీజు మొత్తాన్ని చెక్కుల రూపంలో అందించారు.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో సోమవారం భక్తుల రద్దీనెలకొంది. లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ శ్రీరామలింగేశ్వస్వామి, శ్రీఅక్కపెల్లి రాజరాజేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గోదావరి నదిలో భక్తులు కార్తీకస్నానాలు ఆచరించారు. గోదావరి పౌరోహితులతో సంకల్పాది పూజలు చేయించుకుని, నదిలో కార్తీకదీపాలు వదిలారు. నరసింహుడి ఆలయంలో భక్తులు స్వామివారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. యమధర్మరాజు ఆలయం వద్ద గండదీపంలో నూనెపోసి భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. స్వామివారలకు ఆలయ వేదపండితులు బొజ్జరమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేదబ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య నిత్యపూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయధర్మకర్తల మండలి చైర్మన్ జక్కురవీందర్ ఆధ్వర్యంలో అర్చకులు, సిబ్బంది సేవలు అందించారు.

కొనసాగుతున్న గోదావరి హారతి

ధర్మపురి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకొని ధర్మపురి వద్ద గోదావరి హారతిని 20వరోజు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం లోక క్షేమార్థం, విశ్వశాంతి కోసం ఆలయవేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు విశేషపూజలు నిర్వహించారు. మహిళలు దొప్పల్లో దీపాలు వెలిగించి గోదావరినదిలో వదిలి పుణ్యప్రాప్తి పొందారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, భక్తులు పాల్గొన్నారు.



ధర్మపురిలో గోదావరి నది వద్ద హారతి

కోటిలింగాలలో కార్తీక సందడి..

వెల్గటూర్ : వెల్గటూర్ మండలం కోటిలింగాలలో కార్తీక సోమవారం సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. భక్తులు అధిక సంఖ్యలో గోదావరి స్నానాలు ఆచరించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి గోదావరిలో వదిలారు. అనంతరం శ్రీపార్వతీకోటేశ్వర స్వామిని దర్శించుకొని అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయఅర్చకులు నాగరాజుశర్మ, సంజీవ్‌శర్మ భక్తులచే పూజలు చేయించి ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ ప్రాంగణం శివ నామ స్మరణతో మారుమోగింది. భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ పూదరి రమేష్, కార్యనిర్వహణాధికారి కాంతారెడ్డి తెలిపారు.



కోటిలింగాలలో పూజలు చేస్తున్న భక్తులు

ముగిసిన రాష్ట్రస్థాయి చెస్ టోర్నీ

● ప్రథమ విజేత కరీంనగర్‌కు చెందిన సమర తేజ



విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి చెస్‌టోర్నీలో కరీంనగర్ జిల్లాకు చెందిన సమరతేజ ప్రథమస్థానంలో నిలువగా వరంగల్ జిల్లాకు చెందిన టి రాజు ద్వితీయస్థానంలో నిలిచాడు. రెండు రోజులుగా హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఓపెన్ టూ ఆల్ చెస్‌టోర్నీ సోమవారం ముగిసింది. ఈ ముగింపు వేడుకలకు చెస్ క్రీడాపోటీల నిర్వహణ కార్యదర్శి, చీఫ్ ఆర్బిటర్ కన్నా హాజరై మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఓపెన్ టూ ఆల్ చెస్ టోర్నీలో వివిధ జిల్లాల నుంచి 180విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఉత్కంఠభరితంగా సాగిన పోరులో కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన సమరతేజ ప్రథమస్థానంలో నిలువగా వరంగల్‌కు చెందిన టి రాజు ద్వితీయస్థానం, పెద్దపల్లికి చెందిన విన్సెంట్ తృతీయస్థానంలో నిలిచారని కన్నా తెలిపారు. ఈమేరకు విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతులను, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్బిటర్లు సీహెచ్ శ్రీనివాస్, డి రియాజ్, టీటీడీ కల్యాణ మండపం మేనేజర్ రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక దశ నుంచే క్రీడల్లో ఆసక్తి కనబరచాలి

సుల్తానాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి కలిగేలా ప్రభుత్వం ఎస్జీఎఫ్ పోటీలు నిర్వహిస్తుందని జిల్లా క్రీడల యువజనశాఖ అధికారి అక్కపాక సురేష్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టే పోటీల్లో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఇండియా, ఉమ్మడి కరీంనగర్‌జిల్లా స్థాయి పోటీలను సోమవారం గర్రెపల్లిలో ప్రారంభించారు. ఇందులో పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల వాలీబాల్‌పోటీలు గర్రెపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో నిర్వహించారు. ఇందులో అండర్ 14 బాలబాలికల వాలీబాల్‌పోటీలు నిర్వహించగా పోటీలకు ముఖ్యఅతిథిగా ఎంపీడీవో, గర్రెపల్లి పంచాయతీ స్పెషల్‌ఆఫీసర్ దివ్యదర్శనరావు, డీవైఎస్‌వో అక్కపాక సురేష్, ఎస్‌జీఎఫ్‌కార్యదర్శి ఆసంపల్లిశ్రీనివాస్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ విద్యార్థిదశ నుంచే క్రీడల్లో ఆసక్తి పెంచుకోవాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ఎస్‌జీఎఫ్ పేరిట క్రీడాపోటీలు నిర్వహిస్తుందని తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగాలలో 2శాతం కోటా ఇస్తుందన్నారు. ఇటీవల ప్రపంచస్థాయి ఆర్చరీ పోటీల్లో ఎలిగేడు మండలానికి చెందిన చికిత గోల్డ్‌మెడల్ సాధించడం గర్వకారణమన్నారు. ప్రపంచ మహిళల క్రికెట్‌పోటీలో కప్ సాధించారని, వారిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులంతా తమకు ఇష్టమైన క్రీడారంగంలో రాణించాలని కోరారు. అనంతరం గెలిచిన జట్లకు బహుమతులు అందించారు. ప్రధానోపాధ్యాయురాలు కవిత, కరీంనగర్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గిన్నె లక్ష్మణ్, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల పేట కార్యదర్శి దాసరిరమేష్, అధ్యక్షుడు బాబుశ్రీనివాస్, జాతీయవాలీబాల్ క్రీడాకారుడు కన్నరమేష్, కృష్ణారెడ్డి, మండలకార్యదర్శి ప్రణయ్, వ్యాయామ ఉపాధ్యాయులు ఆసియా, సౌజన్య, రూప, ఖాజాబీ, స్రవంతి, జమున, వెంకటేష్, కుమార్, సోమశేఖర్, సత్యం, శ్రీనివాస్, కొమురయ్య, శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న స్పెషలాఫీసర్ దివ్యదర్శనరావు

షార్ట్‌సర్క్యూట్‌తో వరిపొలం దగ్ధం

ఎలిగేడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన మ్యాదరివేణి కొమురయ్య అనే రైతుకు చెందిన ఎకరం పొలం సోమవారం విద్యుత్ ప్రమాదంలో కాలిపోయింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే తరుణంలో విద్యుత్‌తీగలు వేలాడుతూ ఒకదానికొకటి తగిలి నిప్పురవ్వలతో మంటలు చెలరేగి పొలం కాలిపోయిందని బాధితురాలు కొమురమ్మ పేర్కొంది. దగ్ధమైన పొలాన్ని ఏఈవో గణేష్ పరిశీలించారు. ఆర్ఐ చంద్రశేఖర్ పంటనష్టాన్ని అంచనా వేసి నివేదికను కలెక్టర్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. బాధిత రైతుకు నష్టపరిహారం చెల్లించాలని ఎలిగేడు సింగిల్‌విండో చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి కోరారు.



కాలిపోయిన వరి పొలం

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

తంగళ్లపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో జరుగుతున్న బాల్య వివాహాన్ని సోమవారం అధికారులు అడ్డుకున్నారు. వివరాల్లోకివెళితే.. తంగళ్లపల్లి మండలకేంద్రానికి చెందిన బాలుడు, చింతల్‌ఠాణ ఆర్‌అండ్‌ఆర్ కాలనీకిచెందిన బాలికకు వివాహం జరుగుతుండగా, గుర్తుతెలియని వ్యక్తులు చైల్డ్‌హెల్ప్‌లైన్‌కు ఫోన్‌ద్వారా సమాచారం అందించారు. అధికారులు అక్కడికి చేరుకుని వివాహాన్ని అడ్డుకుని, బాల్య వివాహం చేస్తే నేరమని ఇరువర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్యవివాహం జరిపించబోమని తల్లిదండ్రులు ఒప్పందపత్రం అధికారులకు రాసిచ్చారు.

ఆలయ పునర్ నిర్మాణానికి భూమి పూజ

మెట్‌పల్లి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని వాసవి మాత ఆలయంలో పునర్ నిర్మాణ పనులకు పూజా కార్యక్రమాన్ని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు మైలారపు లింబాద్రి, మెట్‌పల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు రాంబాబులు నిర్వహించి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వాసవి మాత ఆలయ పునర్ నిర్మాణంతో మరింత ఆధ్యాత్మికత పెంపుదల అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్య సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు చెల్లించాలి

జగిత్యాల అర్బన్, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ఇంచార్జి వెన్న మహేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి ప్రజావాణిలో మధ్యాహ్న భోజన సమస్యలపై పిర్యాదు చేసిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేద బడుగు బలహీన వర్గాల పిల్లలకు పౌష్టికాహారంతో పాటు మంచి భోజనాన్ని అందిస్తున్న కార్మికులను ప్రభుత్వం చిన్న చూపు చూడడం తగదని విమర్శించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

సారంగాపూర్, నవంబర్, 10 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణ పనుల్లో వేగవంతం చేయాలని ఎంపీడీవో సీహెచ్ గంగాధర్ అన్నారు. సోమవారం మండంలోని రేచపల్లి గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ళనిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ది దారులతో మాట్లాడారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ఉపాధి పనులు, ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సలీం, పంచాయితీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

భీమారం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మరిపేట గ్రామంలో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఏపీఎం శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సరోజ, సీసీలు శ్రీనివాస్, రత్నాకర్, ఏఈవో నరేందర్, రైతులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

కథలాపూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో సోమవారం బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. వేములవాడ - కోరుట్ల రహదారిపై కేక్ కట్ చేసి పలువురికి పంపిణీ చేశారు. కోరుట్ల నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత విద్యాసాగర్‌రావుకు దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధినేని నాగేశ్వర్‌రావు, మామిడిపల్లి రవీందర్, రాయికంటి శేఖర్, బత్తుల నరేశ్, సబ్బని గంగు, నల్ల గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

అందెశ్రీకి పద్మ శ్రీ ప్రకటించాలి

-మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి -జిల్లావ్యాప్తంగా అందెశ్రీకి ఘన నివాళి

జగిత్యాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాకవి, జానపద వాగ్గేయకారుడు అందెశ్రీ మృతి తీరని లోటని, ఆయనకు పద్మశ్రీ ప్రకటించాలని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఇందిరా భవన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అందెశ్రీ మృతి పట్ల సంతాప కార్యక్ర మాన్ని నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అందె శ్రీ చిత్ర పటం వద్ద నివాళులు అర్పించారు. ఈసందర్భంగా అయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి సాహితివేత్తగా అందెశ్రీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు.



అందెశ్రీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి, ఇతరులు

జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తా వద్ద సోమవారం కొవ్వొత్తులు వెలిగించి అందెశ్రీకి మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అందెశ్రీ మృతి కళా రంగానికి తీరని లోటు

ప్రముఖ కవి, వాగ్గేయ కారుడు అందెశ్రీ మృతి కళారంగానికి తీరని లోటని జగిత్యాలకు చెందిన కవయిత్రి, రచయిత్రి అయిత అనిత అన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ కళారంగానికి అందెశ్రీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు.

ప్రజల గుండెల్లో చెరగని ముద్ర

●**జగిత్యాల టౌన్:** ప్రజల గుండెల్లో చెరగని ముద్రవేసిన గొప్ప కళాకారుడు అందెశ్రీ అని, అయన ఇక లేరన్న వార్త ఎంతో బాధాకరమని ఎమ్మెల్సీ ఎల్ రమణ, మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ దావ వసంతలు వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. అందెశ్రీ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలియజేశారు. అందెశ్రీకి కళాశ్రీ అధినేత గుండేటి రాజు సంతాపం తెలిపారు.

●**గొల్లపల్లి:** ప్రజాకవి అందేశ్రీ కానరాని తీరాలకు తరలివెళ్లడం సాహితీ లోకానికి తీరని లోటని ప్రముఖ కవి చెన్నాడి వెంకట రమణరావు అన్నారు. సోమవారం గొల్లపల్లిలో అందెశ్రీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా అందెశ్రీకి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. తమ మధ్య ఉన్న స్నేహం గూర్చి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

●**వెల్గటూర్:** అందెశ్రీ మృతి సమాజానికి తీరని లోటని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి తులసి ఆగమయ్య విచారం వ్యక్తం చేశారు. పైడిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మౌనం పాటించి నివాళి అర్పించారు. మాజీ ఏఎంసీ ఛైర్మన్ పత్తిపాక వెంకటేష్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో అందెశ్రీ రాసిన పాటలు ప్రజలలో చైతన్యం నింపి ఉద్యమం వైపు నడిపించేలా చేశాయన్నారు.

●**రాయికల్:** పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో అందెశ్రీకి ఘనంగా నివాళులు అర్పించారు. అందెశ్రీకి చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ప్రధానోపాధ్యాయుడు బాలె శేఖర్, అకాడమీ డైరెక్టర్ నిఖిల్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు భావి తరాలకు ఆదర్శంగా నిలవాలి

-జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ నరసింహ

కొడిమ్యాల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్ విద్యార్థులు భావితరాలకు ఆదర్శంగా నిలవాలని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జి. నరసింహ అన్నారు. సోమవారం నాచుపల్లి జేఎన్‌టీయు ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఫ్రెషర్స్ డేలో భాగంగా విద్యార్థులు సరదగా కార్యక్రమాలను చేసారన్నారు. సోషల్ మీడియాలో వచ్చిన వీడియోలలో విద్యార్థులు ఎక్కడా బాధపడినట్లు లేవని స్పష్టం చేశారు. ఫ్రెషర్స్ డేలో ఇంటరాక్షన్‌లో చేసిన కార్యక్రమాలకు ర్యాగింగ్‌ను అంటగట్టవద్దని ప్రిన్సిపాల్ కోరారు. సోషల్ మీడియాలో వస్తున్న దానికి ప్రత్యేక కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులను విచారించగా స్వచ్ఛందంగా ఇంటరాక్షన్‌లో పాల్గొన్నామని చెప్పారన్నారు. రెండో సంవత్సరం విద్యార్థులు ర్యాగింగ్ చేసినట్లుగాని, ఒత్తిడి చేసినట్లు గాని ఎవరూ చెప్పలేదన్నారు. సరదాకైనా, కాలక్షేపానికైనా ఇలాంటి కార్యక్రమాలు చేయవద్దని విద్యార్థులకు సూచించారు. సత్ప్రవర్తనతో క్రమశిక్షణతో ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకరావాలని కోరారు. నాచుపల్లి జేఎన్‌టీయులో ర్యాగింగ్ గురించి సోషల్ మీడియాలో వచ్చినదాన్ని ఖండించారు. విలేకరుల సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్, వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ సతీష్ కుమార్, డాక్టర్ సురేష్ శ్రీపాద, డాక్టర్ సురేష్ అర్జుల్లా, డాక్టర్ సురేష్‌కుమార్ పాల్గొన్నారన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నరసింహ

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి

●అడిషనల్ కలెక్టర్ రాజాగౌడ్



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ రాజాగౌడ్

జగిత్యాలరూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని అడిషనల్ కలెక్టర్ రాజాగౌడ్ సూచించారు. రైతులను ప్రత్యామ్నాయ పంటలైన ఆయిల్‌పామ్ సాగు వైపు మళ్లించాలని జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ రాజాగౌడ్ హార్టికల్చర్, అగ్రికల్చర్, ప్యాక్స్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ఉద్యాన సంచాలకుల ఆదేశాల మేరకు అడిషనల్ కలెక్టర్ అధ్యక్షతన సోమవారం అగ్రిల్చర్, ప్యాక్స్, ఉద్యానశాఖ అధికారులకు ఆయిల్ పామ్ పంటల సాగుపై శిక్షణ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ పంట చాలా అనువైందన్నారు. క్షేత్రపర్యటన నిమిత్తం రైతులను అశ్వరావుపేటకు తీసు కెళ్లాలని సూచించారు. ఈ పంట ద్వారా విదేశీ మాదక ద్రవ్యాన్ని ఆర్జించవచ్చునని, దేశ స్థూల జాతీయోత్పత్తి పెరుగు తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో డీఏఓ భాస్కర్, డీహెచ్ఎస్ఓ శ్యామ్‌ప్రసాద్, డీసీఓ మనోజ్‌కుమార్, అన్ని మండలాల ఏఓలు, హెచ్ఓలు, ఏఈఓలు, హెచ్‌హెచ్ఓలు, ప్యాక్స్ సీఈవోలు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించాలి

రాయికల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని చెరువు సమస్యను పరిష్కరించాలని రాయికల్ మండలంలోని ఆలూరు గ్రామ ప్రజలు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను సోమవారం క్యాంప్ కార్యాలయంలో కలిసి సోమవారం వినతి పత్రం సమర్పించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్, జిల్లా మత్స్య శాఖ అధికారుల దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

కళాశాలలో మధ్యాహ్న భోజనం

మల్యాల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మల్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పోషకాలతో కూడిన ప్రత్యేక మధ్యాహ్నబోజనం అందించే కార్యక్రమును సోమవారం ప్రారంభించారు. కళాశాలకు లంచ్ బాక్స్ తీసుకురాని విద్యార్థులకు కర్ణాటకలోని ముదినహల్లికి చెందిన శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ వారి రైజ్ అగేన్స్ హంగర్ పథకం కింద సరఫరా చేసిన పోషకాలతో కూడిన బియ్యంపప్పుతో కూడిన బోజనం అందించారు. ఈ బోజనంతో విద్యార్థులకు పోషకాలు అంది, చురుగ్గా ఉండేందుకు దోహదపడుతుందని ప్రిన్సిపాల్ మోతె శివరామకృష్ణ ఈ సందర్భంగా తెలిపారు.

యాదవుల హక్కుల సాధనకు పోరాటం

గొల్లపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో జనాభా దామాషా ప్రకారం యాదవులకు దక్కాల్సిన హక్కుల సాధన కోసం నిరంతర పోరాటం చేస్తామని యాదవ సంఘం జగిత్యాల జిల్లా వ్యవస్థాపక అధ్యక్షులు గసవేణి మల్లేష్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం గొల్లపల్లి మండలం మల్లన్న పేట గ్రామంలో యాదవ సంఘం సమావేశంను నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం సంఘం సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్య కార్యవర్గ సభ్యులు మోతుకు మహేష్, జంగ జలేంధర్, లాలీ చావుల రాంచరణ్ ఉన్నారు.

'రాజీవ్ యువ వికాసం' ఇంకెప్పుడు..?

(ఐదో పేజీ తరువాయి)

సిబిల్ స్కోర్ వ్యవహారంలో ఇంకా స్పష్టత రాలేదు.

●ప్రభుత్వ నిర్ణయంపైనే ఆశలు..

స్వయం ఉపాధి ద్వారా నిరుద్యోగులు ఆర్థిక స్వావ లంబన పొందేందుకు రాజీవ్ యువ వికాసం పథ కాన్ని ప్రవేశపెట్టి రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే నెలలు గడుస్తున్నా పథ కం అమలుపై స్పష్టత కరవైంది. ప్రభుత్వం అందించే రుణాలతో కుటుంబానికి బాసటగా నిలవడంతో పాటు ఆర్థికంగా ఎదగాలనే గ్రామీణ యువతకు నిరా శే మిగిలింది. ప్రధానంగా సిబిల్ స్కోరును మినహా యిస్తేనే గ్రామీణ ప్రాంతంలోని ఎక్కువ మంది నిరు ద్యోగులకు ఈ పథకం ద్వారా లబ్ధిపొందే అవకాశం ఉంటుందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

●లబ్ధిదారుల్లో నిరాశ..

ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం యూనిట్ల పంపిణీపై దృష్టి సారించకపోవడంతో ఆయా కేటగిరీలకు దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. మొదటగా ప్రభుత్వం దరఖాస్తుదారులకు మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించి, అర్హులైన వారికి యూనిట్ విలువ ప్రకారం ఐదు విడతల్లో అక్టోబరు వరకు మంజూరు పత్రాలు ఇవ్వాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా మొదటి విడతలో కేటగిరీ-1లో రూ.50 వేలు, కేటగిరీ-2లో రూ. లక్ష వరకు ఎంపికైన లబ్ధిదారులకు ఈ యేడాది జూన్ 2వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు మంజూరు పత్రాలు పంపిణీ చేసి 15వ తేదీ లోపు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. సాధ్యమైనంత తొందరగా రాయితీ విడుదల చేసి గ్రౌండింగ్ పూర్తి చేయాలని తొలుత భావించారు. కానీ ఈ పంపిణీ ప్రక్రియలో జాప్యం ఏర్పడడంతో లబ్ధిదారుల్లో నిరాశ నెలకొంది. అయితే జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక తర్వాతనైనా యువ వికాసంపై సర్కారు దృష్టి సారించాలని యువతీ యువకులు కోరుతున్నారు.

●ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు..

రాజీవ్ యువవికాసం పథకం లబ్ధిదారులకు రుణాలు, ఆర్థికసాయం అందజేత విషయమై ప్రభుత్వం నుంచి వచ్చే మార్గదర్శకాల మేరకు నడుచుకుంటామని సంబంధిత అధికారులు అంటున్నారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద లబ్ధి పొందడానికి నిత్యం పదుల సంఖ్యలో దరఖాస్తుదారులు సంబంధిత శాఖల అధికారులను సంప్రదిస్తున్నారు. రాజీవ్ యువ వికాసం పథకం ప్రారంభంపై స్పష్టత లేకపోవడంతో దరఖాస్తుదారులకు ఎలాంటి సమాచారం అందించాలో తెలియక అధికారులు సైతం అయోమయానికి గురవుతున్నారు.

యువతను ఆదుకోవాలి

-దొనికెల నవీన్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు



రాజీవ్ యువ వికాసం పథకం కింద రుణాలను త్వరితగతిన అందించి యువతను ఆదుకోవాలి. అటు ఉపాధి లేక కుటుంబాలు గడవక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం తొందరగా నిర్ణయం తీసుకోవాలి. సిబిల్ స్కోర్, పాన్‌కార్డుతో సంబంధం లేకుండా అర్హులైన అందరికీ రుణాలు అందించాలి.

కేంద్ర మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కేసు

కొడిమ్యాల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కరీంనగనర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మ్యాక శేఖర్‌పై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.సందీప్ తెలిపారు. మ్యాక శేఖర్ అనే వ్యక్తి ఫేస్ బుక్ అకౌంట్ ద్వారా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి వ్యక్తిగత విషయాలపైన సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసాడని బీజేపీ కొడిమ్యాల మండల అధ్యక్షుడు బండ నర్సింరెడ్డి పిర్యాదు చేసాడన్నారు. దీంతో శేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పదో తరగతి విద్యార్థుల ఫీజు చెల్లింపు చెక్కు అందజేత

జగిత్యాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మోదీ గిఫ్ట్ పేరుతో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిదిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఫీజుల చెల్లింపుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ జారీ చేసిన చెక్కును జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజాగౌడ్‌కు బీజేపీ నాయకులు అందజేశారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజాగౌడ్‌ను కలిసి చెక్కును అందజేశారు. జిల్లాలోని వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గ పరిదిలోని కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండలాలు, చొప్పదండి నియోజకవర్గం పరిధిలోని మల్యాల, కొడిమ్యాల మండలాలకు చెందిన 1,434 మంది ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థుల ఫీజుల కు సంబంధించిన రూ.1,79,250 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆభరణాలు అపహరణ

మల్యాల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ఉన్న ఓ వృద్ధురాలిపై దాడి చేసి చెవి కమ్మలను గుర్తు తెలియని వ్యక్తి ఎత్తుకెళ్లాడు. మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మద్దుట్లకు చెందిన మీనుగు లస్మవ్వ అనే వృద్దురాలు ఆదివారం రాత్రి తిని పడుకుంది. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి లస్మవ్వపై దాడి చేసి తులం బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లాడు. దీంతో బాదితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై సంఘటన స్థలం పరిశీలించారు.

ప్రజావాణిలో 43 దరఖాస్తులు

జగిత్యాల, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కలక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్వయక్రమంలో 43 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ కార్యాలయం వర్గాలు తెలిపాయి. ప్రజావాణి దరఖాస్తుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని అదనపు కలెక్టర్లు బిఎస్ లత, రాజా గౌడ్ లు అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇబ్రహీంపట్నం, నవంబరు10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోదుర్ పెద్ద సబ్‌స్టేషన్ నుండి యామపూర్, వేములకుర్తి సబ్ స్టేషన్‌కు వచ్చే 33 కేవీ ఫీడర్‌లో చెట్ల కొమ్మలు తొలగించడం వల్ల విద్యుత్ వినియోగదారులకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ఒక ప్రకటనో తెలిపారు. ఈ మేరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌ను నిలిపి వేస్తామని తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు వెల్లుల్ల విద్యార్థుల ఎంపిక

మెట్‌పల్లి రూరల్, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) రాష్ట్రస్థాయి పోటీలకు మండలంలోని వెల్లుల్ల విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈవో చంద్రశేకర్ సోమవారం తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో వెల్లుల్ల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు గోర్ల శ్రీచరణ్ ఉపన్యాసం(బాలవక్త) పోటీలో ప్రథమస్థానంలో వ్యాసరచన పోటీలో వమాలెఊపు రిషిక ద్వితీయ స్థానంలో నిలిచినందున విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

హోటల్‌లోకి దూసుకెళ్లిన కారు

కోరుట్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వేములవాడ రోడ్డులో ఆదివారం అర్ధరాత్రి దుకాణ సముదాయాల ముందు ఉన్న షెడ్డుతో పాటు హోటల్‌లోకి అదుపు తప్పి కారు దూసుకుపోయింది. కోరుట్ల పట్టణంలోని ఐబి రోడ్డు నుంచి వేములవాడ వైపు వెళ్తున్న కారు మార్గమధ్యలో ఉన్న మలుపు వద్ద ఉన్న హోటల్ షెడ్‌లోకి దూసుకపోయింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చి గాయపడిన వారిని కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులు ముగ్గురు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ గ్రామాని చెందిన వారిగా గుర్తించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

పెగడపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని పెగడపల్లి మార్కెట్ ఛైర్మన్ బుర్ర రాములు గౌడ్ పేర్కొన్నారు. సోమవరం పెగడపల్లి మండలంలోని మద్దులపల్లి గ్రామంలో ఐకెపి, పిఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ సభ్యులతో కలసి రాములు గౌడ్ సందర్శించి కొనుగోలు తీరును పరిశీలించారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

ధర్మపురి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని ఎస్‌హెచ్ గార్డెన్స్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. కరీంనగర్‌కు చెందిన డాక్టర్ మాడేకర్ నేత్ర వైద్యశాల, రేకుర్తి వైద్యశాల వైస్ ఛైర్మన్ లయన్ చిదుర సురేష్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో ధర్మపురి లయన్స్ క్లబ్ అధ్యక్షులు రవీందర్, సెక్రటరీ సర్వారావు, కోశాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా గోదావరి మహా హారతి

వెల్గటూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం సందర్భంగా కోటిలింగాలలో గోదావరి మహా హారతి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. శ్రీ కోటేశ్వర స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాదులు నిర్వహించారు. అనంతరం పుష్కర ఘాట్ల వద్ద గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు సంజీవ్ శర్మ, నాగరాజు శర్మ, అన్వేష్ శర్మల మంత్రోచ్ఛారణల మధ్య గోదావరి మహా హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ కాతారెడ్డి, ఆలయ కమిటీ ఛైర్మన్ పూదరి రమేష్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ గుండాటి గోపిక జితేందర్ రెడ్డి పాల్గొన్నారు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

మల్యాల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మల్యాలలోని బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన సీహెచ్.సాత్విక రాష్ట్ర స్థాయి వ్యాస రచన పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు నీరజ, పీడీ అంజయ్య తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలలో ప్రథమంగా నిలిచినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి రాము సాత్వికను అభినందించి ప్రశాంసపత్రం అందించారు. అలాగే జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్య అధ్వర్యంలో నిర్వహించిన మూడు వేల మీటర్ల రేస్ వాక్‌లో ఇదే పాఠశాలకు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థిని లాస్య జిల్లా స్థాయిలో ప్రథమంగా నిలిచినట్లు హెచ్ఎం నీరజ తెలిపారు.

మున్నూరుకాపు సంఘ అభివృద్ధికి రూ.2 లక్షలు విరాళం

ధర్మపురి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణ మున్నూరుకాపు సంఘం అభివృద్ధి కోసం ఎన్ఆర్ఐ గడుదాస్ మనోజ్ రూ.2లక్షలు విరాళాలు సోమవారం అందించారు. పట్టణ మున్నూరుకాపు సంఘ అభివృద్ధి కోసం పలువురు దాతలు విరాళాలు అందించారు. ఇందులో భాగంగా ఎన్ఆర్ఐ గడుదాస్ మనోజ్ తన వంతుగా రూ 2 లక్షలు విరాళాలుగా చెక్కును పట్టణ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్‌కు అందించారు. ఈ సందర్భంగా మనోజ్ దంపతులను మున్నూరుకాపు సంఘం పక్షాన సన్మానించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి పట్టణ మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, ప్రధాన కార్యదర్శి బండి మహేష్, ఉపాధ్యక్షులు ముత్తినేని లక్ష్మణ్, కోశాధికారి బుక మహేష్, నాయకులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

గొల్లపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వరి ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కనీస వసతులు కల్పించాలని ఏఎంసీ ఛైర్మన్ భీమ సంతోష్ నిర్వాహకులను ఆదేశించారు. సోమవారం మండలంలోని తిర్మలాపూర్ (పీడీ), రంగదాముని పల్లె, లక్ష్మీపూర్ గ్రామాల్లో వానాకాలం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను నంచర్ల సింగిల్‌విండో ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు జెల్లా అనిల్ కుమార్ యాదవ్, క్యాస గంగాధర్ పాల్గొన్నారు.

గాలికుంటు టీకాలు వేయించాలి

పెగడపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పశువులకు గాలికుంటు టీకాలు విధిగా వేయించాలని పెగడపల్లి మండల పశువైద్యాధికారి డాక్టర్ హేమలత పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నందగిరిలో పశువైద్యశిబిరం నిర్వహించి గాలికుంటు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్యసిబ్బంది మతిన్, వినీత్, జానీపాష, శంకరయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా అక్రమ షెడ్ల నిర్మాణం

-కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోని మున్సిపల్ అధికారులు



జగిత్యాలలో అక్రమంగా వేసిన షెడ్లు

జగిత్యాల టౌన్, నవంబర్ 10(ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలో యథేచ్ఛగా అక్రమ షెడ్ల నిర్మాణం కొనసాగుతోంది. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని పట్టణ ప్రజలు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల పట్టణంలో శ్రీరామ థియేటర్ ఎదురుగా రైతు బజారు వెళ్ళే దారిలో ప్రభుత్వ స్థలంలో కొందరు వ్యక్తులు రేకులతో మూడు అక్రమ షెడ్లు నిర్మాణం చేశారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తుండంపై పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే అదే ప్రాంతానికి చెందిన కొందరు ఈ అక్రమ షెడ్ల విషయంపై ప్రజావాణిలో గత వారం రోజుల క్రితం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోకపోగా, అక్రమ షెడ్లు నిర్మించినవారే ఫిర్యాదు చేసిన వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదులో పేర్కన్నారు. ఇప్పటికైనా అక్రమ షెడ్లను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

నోటీసులు ఇచ్చాం..

మున్సిపల్ అధికారి, శీకర్

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు అక్రమంగా షెడ్లు వేసిన వారికి నోటీసులు ఇస్తున్నాం. వాటిని పూర్తిగా పరిశీలించాక చర్యలు తీసుకుంటాం.

పాఠశాలల్లో వసతుల కల్పన అభినందనీయం

రాయికల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిరుపేద విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు లయన్స్ క్లబ్ సహకారం అభినంద నీయమని లయన్ రీజనల్ ఛైర్మన్ గుంటుక సురేష్ బాబు అన్నారు. రాయికల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో నీటి వినియోగ సౌకర్యార్థం వెయ్యి లీటర్ల వాటర్ ట్యాంక్, పదవ తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు మూడు బస్తాల అటుకుల బ్యాగులను పంపిణీ చేశారు. రాబోయే కాలంలో లయన్స్ క్లబ్ సేవలను ప్రభుత్వ పాఠశాలల్లో మరింతగా విస్తృతంగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కొత్తపెల్లి రంజిత్, కోశాధికారి బెక్కం తిరుపతి, డీసీలు బత్తిని భూమయ్య, మ్యాకల రమేష్, రాంప్రసాద్, ఉపాధ్యక్షుడు వాసం స్వామి ఉన్నారు.

అందరూ స్వచ్ఛంద సేవలో ముందుండాలి

జగిత్యాల అర్బన్, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సేవా కార్యక్ర మాలలో అందరు పాల్గొనాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం జగిత్యాల ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు కృత్రిమ అవయ వాలు అందించేందుకు ఏర్పాటు చేసిన విభిరంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఆపి, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దివ్యాం గులకు అండగా నిలిచేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరుతున్న దన్నారు. రెండు దశాబ్దాల క్రితమే గుజరాత్ రాష్ట్రం నుంచి ప్రత్యేక బృందాన్ని తెప్పించి 250 మంది దివ్యాంగులకు 5 లక్షలతో 55 ట్రై సైకిల్‌లు, క్యాలిపర్స్, జైపూర్ పుట్స్, ఆర్టిఫిషియల్ హాండ్ అందించామన్నారు. అప్పుడు పదవీలో ఉన్న మంత్రులు ఆ కార్యక్రమాన్ని ప్రశంసించిన విషయాన్ని ఎమ్మెల్యే ఈ సందర్భంగా గుర్తు చేశారు.ప్రభుత్వం ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నామన్నారు. నిజమాబాద్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేస్తు మంచి గుర్తింపు తెచ్చుకోవడం అబినందనీయమన్నారు. అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచి అవార్డు అందుకోవడం జగిత్యాల వైద్యుల సేవా నిరతిని సూచిస్తున్నదన్నారు.

ఈ కార్యక్రమంలో డీఎస్పీ రఘు చందర్ జగి త్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ గూడూరి హేమంత్, డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ కోటగిరి సుధీర్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ గిరి నాగభూషణం, రోటరీ క్లబ్ కార్యదర్శి రాంగోపాల్ రెడ్డి, మంచాల కృష్ణ, శ్యాం అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.